కలగానే కల్వర్టుల నిర్మాణం

మండలంలోని పలుగ్రామాల మధ్య ఉన్న ఒర్రెలు వర్షాలు కురిస్తే ప్రమాదకరంగా మారుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కాజ్‌వేలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. దీంతో తమ కష్టాలు తీరేదెన్నడో అంటూ పలువురు వాహనదారులు వాపోతున్నారు.

– కోనరావుపేట

- ఏటా వర్షాకాలంలో పలు గ్రామాలకు వెళ్లాలంటే వాహనదారుల ఇబ్బంది
- ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- నిర్మాణ పనులు చేపట్టి ఇబ్బందులు తీర్చాలని విజ్ఞప్తి


మల్కపేటలో రోడ్డుపై నుంచి వెళ్తున్న వరదనీరు

మండలంలోని మల్కపేట, ధర్మారం, కోనరావుపేట, వట్టిమల్ల, కొండాపూర్ తదితర గ్రామాలకు వెళ్లే దారిలో ఒర్రెలు ఉన్నాయి. ఏటా వర్షాలు కురిస్తే పొంగి పొర్లుతున్నాయి. దీంతో అన్నిగ్రామాల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మల్కపేటలో రెండు ఒర్రెలు, ధర్మారంలో ఒకటి ఉన్నాయి. వీటితో పాటు వట్టిమల్లకు వెళ్లే దారిలో, మండలంలోని నాగారం–పల్లిమక్త గ్రామాల మధ్య, రామన్నపేట–కొలనూర్ రహదారిలో రెండు వాగులు ఉన్నాయి. మూలవాగుపై వట్టిమల్ల–నిమ్మపల్లి మధ్య వాగుపై, వెంకట్రావుపేట–బావుసాయిపేట, మామిడిపల్లి–నిజామాబాద్, కొండాపూర్–వెంకట్రావుపేట మధ్య ఇదివరకు నిర్మించిన కాజ్‌వేలు వర్షాలకు కొట్టుకుపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.


మామిడిపల్లి మూలవాగు వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే (ఫైల్)

ఏళ్లు గడుస్తున్నా..

మండలంలోని పలు గ్రామాల్లోని ఒర్రెలతో మండల ప్రజలు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఒర్రెలవద్ద నిర్మించే కాజ్‌వేల కోసం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో ఒర్రె వద్ద కాజ్‌వే నిర్మించేందుకు సుమారు రూ. 5 నుంచి 10కోట్లపైనే ఖర్చవుతుంది. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు నిధులు మంజూరు కా లేదు. దీంతో మండలకేంద్రానికి వచ్చే ప్రజలు, సిరిసిల్లకు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

వంతెనలు నిర్మించాలి



మండలంలోని పలు గ్రామాల మధ్య కల్వర్టులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వర్షాకాలం వస్తే గ్రామాల మధ్య రవాణా వ్యవస్థ దెబ్బతింటోంది. కాజ్‌వేలు, వంతెనలు నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రజలు కోరుతున్నారు. వెంటనే కల్వర్టుల నిర్మాణాలు చేపట్టి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

– రాస రవీందర్ రెడ్డి, కోనరావుపేట

సమస్యలు పరిష్కరించాలి



ఏటా వర్షాకాలంలో ఒర్రెల్లో నీరు ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సిరిసిల్ల–కోనరావుపేట ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలకేంద్రానికి వచ్చే అధికారులు, ప్రజలు ప్రతి సంవత్సరం ప్ర యా ణం సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నా రు. అధికారులు స్పందించి రహదారి సమస్యలను పరిష్కరించాలి.

– బొర్ర రవీందర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు

త్వరలోనే ప్రారంభిస్తాం



కొండాపూర్, వెంకట్రావుపేట, బావుసాయిపేట, మామిడిపల్లి వద్ద మూలవాగుపై వంతెనలు నిర్మించేందుకు రూ.54 కోట్లు మంజూరయ్యాయి. పనుల అంచనా వ్యయం తయారుచేస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. పలు గ్రామాల మధ్య చిన్న కల్వర్టుల కోసం ప్రతిపాదనలు పంపాం. కాజ్‌వేలకు నిధులు మంజూరు అయితే పనులు ప్రారంభిస్తాం.

– సతీశ్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

క్లుప్తంగా

పొన్నంకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు


మంత్రి పొన్నంతో నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి గడ్డం మధుకర్ (చోటు), యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పొన్నంను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


శ్రీతేజను అభినందిస్తున్న హెచ్‌ఎం

కోనరావుపేట: ఇటీవల జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మాదం శ్రీతేజ ఎంపికైనట్లు జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి దేవత ప్రభాకర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 8నుంచి 10వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని సర్పంచ్ అనుపాటి భారతి, ఎస్‌ఎంసీ చైర్మన్ మంచె భూమయ్య, ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్, పీఈటీ అజయ్‌కుమార్ గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ


ప్లేట్లు అందిస్తున్న సోదరులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన జెల్ల తులసీ, జెల్ల బాలనర్సయ్య తమ తండ్రి జెల్ల రాములు జ్ఞాపకార్థం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు వంద ప్లేట్లు వితరణ చేశారు. స్థానిక హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వంద మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వారిని సన్మానించింది. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయగా ఎల్లారెడ్డిపేటలోని కాంగ్రెస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కోసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఎల్లారెడ్డిపేట పట్టణ ఉపాధ్యక్షుడు పుల్లయ్యగారి తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. నాయకులు ఒగ్గు బాలరాజుయాదవ్, నల్లమందు దేవయ్య, రామస్వామిగౌడ్, గంట నారాయణగౌడ్, గంట శ్రీహరిగౌడ్, దొనుకుల నర్సయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువతి మృతి


అఖిల (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కన్న కూతురు కళ్లముందే మరణించడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మండలంలోని చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన శ్యాగ లక్ష్మీకిషన్ దంపతుల కూతురు శ్యాగ అఖిల (20) పసరికల వ్యాధితో బాధపడుతుండగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది. కాగా అఖిల బీకాం సెకండియర్ చదువుతోంది. మృతురాలికి తల్లి లక్ష్మీ, తండ్రి కిషన్, తమ్ముడు జగన్ ఉన్నారు. ఎప్పుడూ అందరితో కలివిడిగా ఉండే అఖిల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


మనోజ్


రవికాంత్


దాసరి శ్రీజ


ముద్దం శ్రీజ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 4న నిర్వహించిన ఎస్జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని రాచర్ల బొప్పాపూర్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హైజంప్ అండర్–17, 14 విభాగాల్లో ముత్యాల మనోజ్, లగిశెట్టి రవికాంత్, దాసరి శ్రీజ హన్మకొండలో ఈనెల 9 నుంచి 10 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ పంతం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులను ఎస్‌ఎంసీ కమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు ఎంపిక

కరీంనగర్‌లోని సెయింట్ జాన్ స్కూల్‌లో నవంబర్ 25న జరిగిన ఖోఖో పోటీలో రాచర్లబొప్పాపూర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ముద్దం శ్రీజ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈనెల 8, 9,10వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ ప్రభాకర్ తెలిపారు.

టీఆర్‌టీఎఫ్ కార్యవర్గం


లక్ష్మీనారాయణ


సుల్తాన్‌రాజు

కోనరావుపేట: టీఆర్‌టీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా మహేశుని లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్ రాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బుర్ర కృష్ణప్రసాద్ తెలిపారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్‌గా అనుముల కనుకయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కరుణ లత ఎన్నికయ్యారు.

పదోన్నతులు కల్పించాలి

అన్ని పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తూ సర్వీస్ పర్సన్లు, స్కావెంజర్లను నియమించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోయన్నగారి నారాయణ అన్నారు. కొత్త ప్రభుత్వం నిలిచిపోయిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో పోతుగంటి రమేశ్, లక్కె లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్

ముస్తాబాద్: రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ కార్యవర్గ ఎన్నికలు గురువారం నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడిగా జిల్లెల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శాస్త్రుల శ్యామ్ సుందర్‌శర్మ, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, బాలకిషన్, జిల్లా కౌన్సిలర్లుగా ఇప్పకాయల ప్రకాశ్, రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బుర్ర కృష్ణప్రసాద్ వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శి మీస రవి, అసాని అనిల్‌రెడ్డి, బానోత్ వర్ధన పాల్గొన్నారు.



కాలక్షేపంగా క్రికెట్

అసెంబ్లీ ఎన్నికల విధుల్లో తలమునకలైన బీఎస్‌ఎఫ్ జవాన్లు కాస్త ఉపశమనం కోసం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ ఆడారు. ఎన్నికల సమయంలో అవిశ్రాంతంగా పనిచేసిన వారు ఉత్సాహంగా ఉండేందుకు ఇలా తోటి జవాన్లు ఆడినట్లు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

- రూ.2 వేల జరిమానా

సిరిసిల్లక్రైం/ముస్తాబాద్(సిరిసిల్ల): చెట్లను నరికే విషయంలో తలెత్తిన వివాదంలో దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు. 2016 అక్టోబర్ 4న ముస్తాబాద్ మండలం పోత్గల్‌కు చెందిన తలారి రాజు అదే గ్రామానికి చెందిన జంగ భూంరాజుల మధ్య చెట్లను కొట్టుకునే విషయంలో గొడవ జరిగింది. ఆ గొడవలో భూంరాజు రాయితో రాజు తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన రాజుని వెంటనే ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. జరిగిన సంఘటనపై ముస్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి దాడిచేసిన భూంరాజుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రుద్రంగి: చలితీవ్రత అధికంగా ఉన్నందున యాజమాన్య పద్ధతులతో నారు మడులను రక్షించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రివేళల్లో నారుమడిలో నీరు నిల్వ ఉంచి తెల్లవారుజామున నీరు తీసివేయాలన్నారు. ఉదయం, పగటి పూట కొత్తనీరు పెడుతూ తీసి వేస్తూ ఉండాలన్నారు. నారు ఏపుగా ఎదిగేందుకు సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు, గొర్రె, పశువుల పేడ ఎరువును 2గుంటల నారుమడికి రెండు క్వింటాళ్లు (సేంద్రియ ఎరువులను) వేసుకోవాలన్నారు. జింక్‌లోప నివారణకు లీటరు నీటికి 2గ్రాములు జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. అగ్గితెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

ఆటో బోల్తా



వేములవాడరూరల్: అదుపు తప్పి ఓ ఆటో బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి – నాగాయపల్లి మధ్య ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఓ ఆటో బోల్తా పడినట్లు తెలిసింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కిడ్నీ బాధితుడికి చేయూత

జగిత్యాలటౌన్/మల్యాల: రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న హన్మయ్య కుటుంబానికి సత్యసాయి సేవాసమితి అండగా నిలిచింది. మల్యాల మండలం తక్కల్లపల్లి గ్రామానికి చెందిన దూల హన్మయ్య రెండు కిడ్నీలు చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతుండగా.. విషయం తెలుసుకున్న సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ స్పందించారు. దాతల సహకారంతో సేకరించిన రూ.16,500, ఆ కుటుంబానికి కావాల్సిన వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, బ్లాంకెట్లు, చెద్దర్లు తదితర వస్తువులు తక్షణ సాయంగా గురువారం అందజేశారు. సత్యసాయి సేవాసమితి పూర్వ కన్వీనర్ చిటుమల్ల లక్ష్మీనారాయణ, సభ్యులు కోటగిరి మహేందర్, అనంతుల అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బొడ్రాయి ఉత్సవాలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు రెండ్రోజులుగా జరుగుతున్నాయి. అందులో భా గంగా గురువారం గ్రామం చుట్టూ బందనం చేశారు. గురువారం సాయంత్రం శుక్రవారం ఉదయం వరకు బందనం పొలిని దాటి ఎవరూ కూడా వెళ్లొద్దని గ్రామంలోకి వచ్చేవారికి కూడా ప్రవేశం లేదని తెలిపారు. గ్రామంలోని ప్రజలు పొలిమేర దాటి వెళ్లరని ఈ సాంప్రదాయం అనాదిగా వస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


కొదురుపాకలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ ఉమ, నాయకులు

బోయినపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ అన్నారు. మండలంలోని కొదురుపాక గ్రామంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ హితం కోసం ఎంపీ సంతోష్ చేపట్టిన గ్రీన్ చాలెంజ్‌తో ఎందరో మొక్కలు నాటారన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ కొనుకటి నా గయ్య, సర్పంచులు చిందం రమేశ్, బూర్గుల నంద య్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కొనుకటి లచ్చిరెడ్డి, భాస్కర్, రంగి తిరుపతి, కొండం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో శ్రీ మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠాపన కా ర్యక్రమాలు నిర్వహించారు. కులసంఘాల వారీగా బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి ప్ర త్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో వెళ్లి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.


దప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో వెళ్తున్న మహిళలు

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు


హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు


ముస్తాబాద్: మండలకేంద్రం నుంచి తరలుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. తరలి వెళ్లినవారిలో మండల శాఖ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి కృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఏలూరి రాజయ్య ఉన్నారు.

ముస్తాబాద్: ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ముస్తాబాద్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు గురువారం తరలివెళ్లారు. సీఎంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివెళ్లినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. పదేళ్ల అనంతరం తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టబోతోందన్నారు. నాయకులు ఎల్లాగౌడ్, పెద్దిగారి శ్రీనివాస్, రాములు, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, తిరుపతి, బాల్‌రెడ్డి, నరేశ్ తదితరులున్నారు.


ఎల్బీస్టేడియంలో కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం చేపట్టగా మండల కాంగ్రెస్ నాయకులు గురువారం పెద్దఎత్తున హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియానికి తరలివెళ్లారు. జిల్లా నాయకులు కూస రవీందర్, ఏనుగుల కనుకయ్య, కట్ట లచ్చయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, హరికృష్ణ, ఎండీ.హుస్సేన్, బాబు, ముదాం శ్రీనివాస్, రఫీ, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు

సిరిసిల్లక్రైం: ఆలయంలోని హుండీతోపాటు ఒకరి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగకు ఏడాది జైలుతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం 17 జూన్ 2023న సిరిసిల్లలోని తారకరామనగర్‌లోని హనుమాన్ ఆలయంలో హుండీ దొంగతనం జరిగింది. దీనిపై మిట్టపల్లి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే సెప్టెంబర్ 15న వెంకంపేటకు చెందిన గడ్డం శ్రీధర్ ఇంటిలో సెల్‌ఫోన్ దొంగతనం జరిగింది. జూన్ 24న బీవైనగర్‌లోని హనుమాన్ ఆలయంలో మరో దొంగతనం జరిగింది. వరుస దొంగతనాలపై అందిన ఫిర్యాదులతో దర్యాప్తు చేసిన పోలీసులు చిత్తూరు జిల్లాకు చెందిన వద్ది చెంగప్ప సుబ్రమణ్యం అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుపై చార్జిషీట్ దాఖలు చేయడంతో పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి దొంగతనానికి పాల్పడిన చెంగప్ప సుబ్రహ్మణ్యంకు ఏడాది జైలుతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. .

ద్విచక్రవాహనం దొంగిలించిన కేసులో ..

ద్విచక్రవాహనాలను దొంగిలించిన కేసులో ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 8న ఎల్లారెడ్డిపేట బస్టాండ్ వద్ద పార్క్ చేసిన బైక్‌ను ఓ వ్యక్తి దొంగిలించాడు. ఎల్లారెడ్డిపేటకు చెందిన జయరి నరేశ్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి గంభీరావుపేట మండలం గజసింగారం గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్‌ను గుర్తించి రిమాండ్‌కు పంపించారు. పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయగా కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి శ్రీనివాస్‌కు ఏడాది జైలు విధించారు.